

చీనీ టన్ను రూ.26,400

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,400 పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.1°/10.0°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎంపిక



అనంతపురం సెంట్రల్: సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎంపిక పూర్తయినట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. సభ్యులందరూ కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. హైలెవల్ మెయిన్ కెనాల్ చైర్మన్‌గా కేశవరెడ్డి, వైస్ చైర్మన్‌గా రమేష్ బాబు, మిడ్‌పెన్నార్ సౌత్ కెనాల్ చైర్మన్‌గా శేఖర్, వైస్ చైర్మన్‌గా చంద్రాయుడు, నార్త్ కెనాల్ చైర్మన్‌గా రాజారెడ్డి, వైస్ చైర్మన్‌గా వెంకటేష్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ చైర్మన్‌గా ప్రమీలమ్మ, వైస్ చైర్మన్‌గా సత్యనారాయణ రెడ్డి, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ చైర్మన్‌గా మారయ్య, వైస్ చైర్మన్‌గా రామకృష్ణ, ఆలూరు బ్రాంచ్ కెనాల్ చైర్మన్‌గా కిష్టప్ప, వైస్ చైర్మన్‌గా రామాంజనేయులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా చైర్మన్ ఎంపిక ఈనెల 21న ఉండవచ్చని పేర్కొన్నారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.62.36 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ. 62.36 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ కే.వాణి తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ 49 రోజులకు గానూ రూ. 62,36,139 నగదును భక్తులు స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. అలాగే, అన్నదానం హుండీ ద్వారా రూ.26,206 అందిందన్నారు. 7 గ్రాముల బంగారు, 1.630 కిలోల వెండి, కెనడా డాలర్లు 20, నేపాల్ రుపీస్ 205, సౌదీ అరేబియా రియాన్స్ 10 స్వామివారికి సమర్పించినట్లు పేర్కొన్నారు. గుంతకల్లు ఆర్టీసీ హనుమాన్ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జిల్లాకు వర్షసూచన

- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- జేసీ శివ్‌నారాయణ శర్మ



అనంతపురం అర్బన్: జిల్లాకు రాబోవు మూడు రోజులూ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ తెలియజేసిందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మంగళవారం తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు శ్రీధరగట్ట, కణేకల్లు, కల్లూరు, ఉద్దేహాళ్‌లోని కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొలాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలని సూచించారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా సాధారణ రకం వరి క్వింటాల్ రూ.2,300, గ్రేడ్–ఏ రకం క్వింటాల్ రూ.2,320 ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. గోనె సంచులు, రవాణా, కూలీ చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు.

రేపు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 'వర్చువల్ విచారణలు–వినియోగదారుల న్యాయానికి డిజిటల్ యాక్సిస్' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో పోటీలు నిర్వహించాలని ఆయా పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. అలాగే వర్చువల్ విచారణలు – వినియోగదారుల న్యాయానికి డిజిటల్ యాక్సిస్, వినియోగదారుల హక్కుల రక్షణ' అంశంపై నిర్వహించే క్విజ్ పోటీలకు సంబంధించి ఇద్దరు విద్యార్థులు ఒక టీమ్‌లో ఉండేలా చూడాలన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ నెల 21న జిల్లా సైన్స్ సైంటర్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని సూచించారు.

నొక్కుడు... బొక్కుడు!

దుకాణాల వద్దే ప్రజల పరేషన్

అనంతపురం తపోవనంలోని ఓ చౌక దుకాణానికి ఇటీవల కార్డుదారుడు వెంకటేష్ (పేరు మార్చాం) వెళ్లాడు. వేలిముద్ర వేసి బియ్యం తీసుకున్నాడు. కందిపప్పు అడిగితే అయిపోయిందని డీలర్ చెప్పగా.. అట్లా ఎట్లా అయిపోతుందని వెంకటేష్ ప్రశ్నించాడు. దీంతో కంగారు పడిన డీలర్... 'లోపల ఉన్నాయ్. సైలెంట్‌గా వెళ్లి తెచ్చుకో' అనడంతో మూడు ప్యాకెట్లు తీసుకుని డబ్బు ఇచ్చాడు. ఇదేమి పద్ధతి అని డీలర్‌తో అంటే.. 'అన్నీ సక్రమంగా ఇస్తే ఏం మిగులుతుంది? తూకం తక్కువ వేసి మిగుల్చుకున్న బియ్యం, పంపిణీ చేయకుండా ఉంచుకున్న కందిపప్పు బయట అమ్ముకుంటాం' అని చెప్పాడు. ఇక్కడే కాదు.. జిల్లాలోని చాలా చౌక దుకాణాల్లో నెలా నెలా జరుగుతున్న తంతు ఇదీ..



- ఈనెల 11న పామిడి పట్టణం కొండూరు రోడ్డులోని ఒక తోటలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారనే సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. 250 ప్యాకెట్ల (ఒక్కోటి 50 కిలోలు)లోని 126.25 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.
- యాడికి శివారులో విజిలెన్స్ అధికారులు నవంబరు 29న తనిఖీలు నిర్వహించారు. ఆటోలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల (29 సంచులు) రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేశారు. ఆటో డ్రైవర్, బియ్యం యజమానిపై 6ఏ కేసుతో పాటు యాడికి పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించారు.



ఈనెల 11న పామిడిలోని ఒక తోటలో పట్టుబడ్డ రేషన్ బియ్యం

- యథేచ్ఛగా చౌక బియ్యం దందా
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెరిగిన జోరు
- చౌక దుకాణాల్లో తూకాల్లో మోసం
- కార్డుపై రెండు నుంచి మూడు కేజీల బియ్యం నొక్కేస్తున్న వైనం
- కందిపప్పు కూడా ప్రజలకు పంపిణీ చేయకుండా పక్కదారి

అనంతపురం అర్బన్: జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. నల్ల బజారుకు పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ మాఫియా జోరు పెరిగిందనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా 'తగ్గేదే లే' అంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

అక్రమాలకు సర్కారు ద్వారాలు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేపట్టి డీలర్లు అక్రమాలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాహనాలు తీసేసి గతంలో మాదిరిగా చౌక దుకాణాల వద్దే రేషన్ పంపిణీ ప్రారంభించడంతో డీలర్లు అక్రమాలకు ద్వారాలు తెరిచారు. కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో 10 కిలోలకు ఒక కిలో, 15 కిలోలకు రెండు కిలోలు, 20 కిలోలకు మూడు కిలోలు చొప్పున నొక్కుడు మొదలు పెట్టారు. జిల్లావ్యాప్తంగా పలు వురు డీలర్లు కందిపప్పును కార్డుదారులకు ఇవ్వకుండా బొక్కేస్తున్నారు. ఇలా మిగుల్చుకున్న సరుకులను అక్రమ వ్యాపారులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భారీగా సొమ్ము చేసుకుంటూ..

పేదల ఆర్థిక అవసరాలను అనుకూలంగా చేసుకుని వారి నుంచి అక్రమార్కులు కిలో బియ్యం రూ.20తో కొనుగోలు చేస్తున్నారు. డీలర్ల వద్ద నుంచి కూడా అదే ధరతో తీసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు తమ మనుషులను మండలాల్లో ఏర్పాటు చేసుకుని దందా జోరుగా సాగిస్తున్నారు.

జూన్ నుంచి 6ఏ కేసులు ఇలా..

నెల	6ఏ కేసులు సంఖ్య	సీజ్ చేసిన బియ్యం (క్వింటాళ్లలో)
జూన్	1	8.40
జూలై	19	154.15
ఆగస్టు	18	308.32
సెప్టెంబరు	11	103.67
అక్టోబరు	13	186.65
నవంబరు	11	639.61
మొత్తం	73	1,400.80

సేకరించిన బియ్యాన్ని 50 కేజీల సంచుల్లో ప్యాక్ చేసి కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, బెంగళూరు, బంగారుపేట, పావగడ, చిక్‌బళ్లాపూర్ తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. కిలో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తూ డబ్బును జేబుల్లోకి వేసుకుంటున్నారు.

క్రిమినల్ కేసుల నమోదు



రేషన్ బియ్యం అక్రమాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి దాడులు నిర్వహిస్తున్నాం. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై 6ఏ కేసుతో పాటు పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయిస్తున్నాం. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తే తక్షణం సంబంధిత తహసీల్దారు లేదా విజిలెన్స్ అధికారులకు లేదా సీఎస్ డీటీకి సమాచారం ఇవ్వాలి.

– వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

జనంపై 'చలి' పంజా

- రికార్డుస్థాయిలో పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు



అనంతపురం అగ్రికల్చర్: చలి పంజా విసురుతోంది. రోజురోజుకు చలితీవ్రత పెరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు పతనమవుతున్నాయి. మంగళవారం మరింత కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. మడకశిరలో 9.3 డిగ్రీలు, కుందుర్పిలో 10 డిగ్రీల నమోదుతో ఈ సీజన్‌లో కనిష్టం రికార్డయ్యాయి. అలాగే, బెళుగుప్ప 10.1 డిగ్రీలు, కంబదూరు 10.3, గుత్తి 10.4, శెట్టూరు 10.9, గుమ్మఘట్ట 11.1, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రంలో 11.7 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 12 నుంచి 15 డిగ్రీల లోపు నమోదయ్యాయి. అటు శ్రీ సత్యసాయి జిల్లాలోని పరిగిలో 10.7 డిగ్రీలు, సోమందేపల్లి 10.9, గుడిబండ 11.2, అగళి 11.3, చిలమత్తూరు 11.4, రొద్దం 11.5, అమరాపురం 11.6 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 12 నుంచి 14 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. మడకశిర, హిందూపురం, పెనుకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాలు చలిగుప్పిట్లో వణుకుతుండగా రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, అనంతపురం డివిజన్లలో కూడా తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు కారణంగా చీకట్లు అలుముకుంటున్నాయి. నీరెండ కారణంగా పగలంతా కూడా చలి వాతావరణం కనిపిస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి: అతి శీతల పరిస్థితులు అన్ని వర్గాలను వణికిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, రైతులు, శ్రామికులు, పాలు, కూరగాయల అమ్మకందారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. చలి బారి నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏసీలు, ఫ్యాన్లు తగ్గించేయాలని సూచిస్తున్నారు. మఫ్లర్లు, మంకీక్యాప్, మాస్కులు, గ్లౌజులు, ఉన్ని సంబంధిత దుస్తులు వాడాలి. విటమిన్–డీ లోపం ఉన్న వారు ఎండలో వాకింగ్ చేయాలి. కాచివడబోసిన నీళ్లు తాగాలి. వేడి, తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి.

ఏమ్మా బీఎల్‌ఓ మీ ఇంటికి వచ్చారా..?

- ఓటరు దరఖాస్తులపై కలెక్టర్ ర్యాండమ్ చెక్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ ఈనెల 26తో ముగియనుంది. ఈ క్రమంలో దరఖాస్తులు పరిష్కరించిన తీరుపై కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ర్యాండమ్ చెక్ నిర్వహించారు. నగర పరిధిలోని ఆరో రోడ్డు, అర్కేనగర్, ఎంజీ కాలనీలో పర్యటించారు. ఓటరుగా నమోదు (ఫారం–6), ఓటు తొలగింపు (ఫారం–7), ఓటు వివరాల మార్పు (ఫారం–8)నకు సంబంధించి పరిష్కరించిన దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. వెరిఫికేషన్‌కు బీఎల్‌ఓ ఇంటి వద్దకు వచ్చారా అని అడుగుతూ ఓటు నమోదుకు సంబంధించి సర్టిఫికెట్‌లు పరిశీలించారు. ఓటు తొలగింపు, వివరాల మార్పు దరఖాస్తులను పరిశీలించి వివరాలను అడిగారు. అందుబాటులో లేని దరఖాస్తుదారులతో వీడియో కాల్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దారు హరికుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్ట భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా పాత ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌లను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లను తనిఖీ చేశారు. గోడౌన్ అంతర్భాగాలు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా, పోలీసు పికెటింగ్ కొనసాగాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, తహసీల్దారు హరికుమార్, కో–ఆర్డినేషన్ విభాగాధిపతి యుగేశ్వరి, ఎన్నికల డీటీలు కనకరాజు, దివాకర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశానాన్నీ చెరబట్టారు

- బూదగవిలో టీడీపీ నేతల బరితెగింపు
- బోర్డు పీకేసి దర్జాగా పంటల సాగు
- కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు

ఉరవకొండ: అధికార అండతో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. కూటమి సర్కారు ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వ స్థలాలు, భూములను కబ్జా చేయడం ప్రారంభించిన 'పచ్చ' నేతలు.. ఇటీవల శ్మశానాలనూ చెరబడుతున్నారు. ఉరవకొండ మండల పరిధిలోని బూదగవి గ్రామంలో హిందూ శ్మశాన వాటిక కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని టీడీపీ నేతలు దర్జాగా ఆక్రమించి కంది పంట సాగు చేస్తుండటమే ఇందుకు నిదర్శనం. బూదగవి గ్రామంలో హిందూ శ్మశాన వాటిక లేకపోవడంతో గ్రామస్తులు కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామ సర్పంచ్ లక్ష్మి ఈ విషయాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, అప్పటి ఎంపీ తలారి రంగయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు.. స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే అప్పటి తహసీల్దార్ మునివేలు బళ్లారి బైపాస్ సమీపంలోని మల్లప్ప కొండ వద్ద సర్వే నం. 59లో 1.40 ఎకరాల స్థలాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపగా.. 2022 మే 22న శ్మశాన వాటికకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గ్రామస్తులు ఎంతో సంతోష పడ్డారు.



బూదగవి గ్రామానికి కేటాయించిన శ్మశాన వాటిక స్థలంలో కంది పంట సాగుచేస్తున్న దృశ్యం

దర్జాగా కబ్జా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీడీపీ నాయకులు బూదగవి శ్మశాన వాటికపై కన్నేశారు. శ్మశాన వాటిక అంటూ ఏర్పాటు చేసిన బోర్డును ఇటీవల పీకేశారు. ఉరవకొండకు చెందిన ఓ ప్రయివేటు సర్వేయర్ సహకారంతో సదరు స్థలంలో ఇటీవల పంటల సాగు ప్రారంభించారు. పచ్చ నేతలు బరితెగించి శ్మశాన వాటికను కబ్జా చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో బూదగవి గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషా వివరణ కోరగా ఆయన స్పందించారు. శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. వెంటనే బూదగవిలో స్థలాన్ని పరిశీలించి పంటలు సాగు చేసే వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయిస్తామని పేర్కొన్నారు.

డ్రిప్ పరికరాల మంజూరు వేగవంతం

- ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆదేశం



జూమ్ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, కంపెనీ డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లు

అనంతపురం అగ్రికల్చర్: సూక్ష్మ సేద్యం(బిందు, తుంపర) పరికరాల మంజూరు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ (పీఓ) ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. సూక్ష్మ సేద్యం పరికరాల అంశంపై మంగళవారం ఆయన గుంటూరు నుంచి జిల్లా ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్‌తో పాటు కంపెనీల డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ ఏడాది జిల్లాకు 42,100 హెక్టార్లకు పరికరాలు ఇవ్వాలని టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. 451 ఆర్‌ఎస్‌కేల్లో ఇప్పటి వరకు 42,459 మంది రైతులు 58,475 హెక్టార్లకు పరికరాలు కావాలని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయన్నారు. ఇందులో ఇప్పటి వరకు 17,850 మంది రైతులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ప్రాథమిక పరిశీలన (పీఐఆర్) చేశారన్నారు. 6,568 మంది రైతులు తమ వాటా కింద డీడీలు చెల్లించినట్లు తెలిపారు. కలెక్టర్ అనుమతితో 6,818 హెక్టార్లకు సరిపడా 5,794 మంది మంజూరు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే 4,245 హెక్టార్లకు సంబంధించి 3,611 మంది రైతులకు మాత్రమే కంపెనీలు మెటీరియల్ సరఫరా చేశారన్నారు. ఇది సంతృప్తికరంగా లేదన్నారు. మొత్తం ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ప్రాథమిక పరిశీలన పూర్తవగానే బీఓక్యూ, బీఎంసీ, రైతు వాటా త్వరితగతిన కట్టించి పరికరాలు మంజూరు చేయాలన్నారు. ఎంఐఏఓలు, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల సహకారంతో ఇన్‌స్టాలేషన్ చేసిన వెంటనే ఫైనల్ ఇన్‌స్పెక్షన్ (తుది తనిఖీ) పూర్తి చేయాలని ఆదేశించారు.

వీఆర్‌కు యల్లనూరు ఎస్‌ఐ, కంప్యూటర్ ఆపరేటర్

యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీరాం ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్ నాయక్‌ను ఎస్పీ జగదీష్ వీఆర్‌కు పంపారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల యల్లనూరు పోలీసు స్టేషన్‌లో జరిగిన కొన్ని ఘటనలు అంతటా చర్చకు దారితీశాయి. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణలో అన్నీ వాస్తవాలని తేలడంతో చర్యలకు ఉపక్రమించారు. ఎస్‌ఐ, కంప్యూటర్ ఆపరేటర్‌ను వీఆర్‌కు పంపారు. త్వరలోనే నూతన ఎస్‌ఐ బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

సార్ల లేటు.. జనం పాట్లు

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో అధికారులు సమయపాలన పాటించడం లేదు. ఆర్టీఓ, డీటీసీలు ఉంటున్నప్పటికీ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు కనిపించకుండా పోతున్నారు. అనంతపురం ఆర్టీఏ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కూడా డ్రైవింగ్ టెస్టులు, ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభం కాలేదు. ఉన్న ఒక ఏఎంవీఐ ఎల్‌ఎల్‌ఆర్ పరీక్షలకు పరిమితం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకింగ్ సిస్టంకు సంబంధించిన ప్రైవేటు ఏజెన్సీ కార్యకలాపాలు కూడా ఇష్టారాజ్యంగా తయారయ్యాయి. ప్రైవేటు ఏజెన్సీ నిర్వాహకుడు పెళ్లికి వెళ్లాడంటూ మంగళవారం ఆయన తమ్ముడు రావడం గమనార్హం. అనంతపురం ఆర్టీఏ కార్యాలయానికి నిత్యం వందల మంది డ్రైవింగ్ లైసెన్స్, ఎల్‌ఎల్‌ఆర్, ఫిట్‌నెస్ పరీక్షలు ఇతరత్రా సమస్యలపై వస్తుంటారు. అధికారుల నిర్లక్ష్యంతో అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు ఉంటున్న జిల్లా కేంద్రంలోనే ఈ దుస్థితి ఉంటే ప్రాంతీయ కార్యాలయాల్లో మరే స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇప్పటి నుంచైనా అధికారులు సరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎంవీఐల చాంబర్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



ఫిట్‌నెస్ కేంద్రం వద్ద అధికారులు లేక నిల్చిపోయిన వాహనాలు



డ్రైవింగ్ టెస్ట్ కోసం వచ్చిన వాహనదారుల నిరీక్షణ

క్లుప్తంగా

టీచర్లను సర్దుబాటు చేయండి

• డీఈఓకు వైఎస్సార్‌టీఏ వినతి


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: చాలా వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థుల బోధన కష్టంగా మారిందని, పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే ఆయా స్కూళ్లకు టీచర్లను సర్దుబాటు చేయాలంటూ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ఎం.ప్రసాద్‌బాబును వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, రిటైర్డ్ టీచరు రోగప్ప కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి మాట్లాడుతూ జిల్లా సరిహద్దు మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత చాలా తీవ్రంగా ఉందన్నారు. సబ్జెక్టు టీచర్లు లేక పదో విద్యార్థులకు బోధన జరగడం లేదన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని విద్యాబోధనకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఐఆర్ ప్రకటించాలన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఐఆర్ ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదుకోవాలన్నారు. అలాగే 12వ పీఆర్సీ కమిషన్ వేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలన్నారు.

నేడో, రేపో విధుల్లోకి జెడ్పీ సీఈఓ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి ఒకట్రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. రెండున్నర నెలల క్రితం నంద్యాల జిల్లా డ్వామా పీడీగా ఉన్న ఆయనను అనంతపురం జెడ్పీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పట్లో ఆయన రెండు నెలల పాటు సెలవులో ఉండడంతో విధుల్లోకి చేరలేకపోయారు. 20 రోజుల క్రితం అమెరికా నుంచి స్వస్థలం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చేరుకున్నారు. ఈ నెల 2న సీఈఓగా బాధ్యతలు చేపట్టాల్సి ఉన్నా ఆయన రాలేదు. సెలవు పొడిగించుకున్నారు. ఈ నేపథ్యంలో కొందరు శ్రేయోభిలాషుల సూచనల మేరకు అనంతపురం సీఈఓగా చేరేందుకు ఆయన సుముఖత చూపినట్లు తెలిసింది.

ఉరుముల కళ... వృత్తి భళా

సంప్రదాయ కళలపై ప్రస్తుతం పెరుగుతున్న ఆసక్తి

- ఆలయాల వద్ద, జాతర్లలో ఉరుముల సంప్రదాయం తప్పనిసరి
- పుష్ప–2 సినిమాలో ఆత్మకూరు నివాసి ఉరుముల సోమశేఖర్.
- జాతీయ స్థాయిలో ఆత్మకూరు ఉరుముల కళాకారులకు ప్రత్యేక గుర్తింపు

చితికి జీర్ణమైపోయిన అనేక జానపద కళారూపాల్లో ప్రత్యేకమైన ఉరుము నృత్యం ఒకటి. తలకు అందంగా రుమాళ్లు చుట్టుకుని, మెడలో కాసుల దండలు ధరించి, ఎర్రని, పచ్చని శాలువాలు కప్పుకుని, నిలువు అంగీలు ధరించి, పల్ల వేరు చెట్టు కర్రతో తయారు చేసిన ఉరుములకు మేక చర్మపు మూతలు వేసి కదర పుల్లలతో వాయించుకుంటూ దేవాలయ ప్రాంగణాల్లో నృత్యం చేస్తూ ఉంటారు. కనుమరుగైపోతోందని అనుకుంటున్న తరుణంలో ఈ సంప్రదాయ కళపై ఇటీవల గ్రామీణుల్లో ఆసక్తి పెరిగింది. దీంతో ఉరుముల వృత్తిలో రాణిస్తున్న కళాకారులకు గుర్తింపు లభిస్తోంది.




ఉరుము కళాకారులను అభినందిస్తున్న అప్పటి సీఎం జగన్ (ఫైల్)



తుంగభద్ర పుష్కరాల్లో ఉరుముల కళాకారులు (ఫైల్)

ఆత్మకూరు: జానపద కళారూపాలలో చాలా కళలు దైవారాధనలో భాగంగా వృత్తివిద్యలయ్యాయి. అందులో జిల్లాకే ప్రత్యేకమైన ఉరుము వృత్తిపై ఆధారపడి దాదాపు 2 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇందులోనూ ఆత్మకూరు మండలంలో 40 కుటుంబాలు ఉన్నాయి. బృంద నృత్యానికి చెందిన ఈ కళారూపం మాల కులస్తుల జీవన వృత్తి కావడం గమనార్హం. దైవారాధనలో ఉరుము వృత్తికి చాలా ప్రాధాన్యత ఉంది. కొన్నేళ్ల క్రితం వరకూ ఉరుముల కళాకారులకు పెద్దగా ప్రాధాన్యత ఉండేది కాదు. ప్రస్తుతం నూతన గృహ ప్రవేశమైనా, ఆలయాల వద్ద జాతరలు జరిగినా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు ఏవైనా జరిగినా ఉరుము కళాకారుల నృత్యం తప్పనిసరిగా ఉంటోంది. ఎంతో నిష్ఠాగరిష్ఠులైన ఉరుములోల్లు అన్ని మతాల దేవతలను ఆరాధిస్తారు. వీరిలో నియమాలు ఎక్కువ. ఇంట్లో ఈత పరకలు వాడరు. ఈత చెట్టు కింద కూర్చోరు. కాళ్లకు చెప్పులు ధరించరు. వీరు అక్కమ్మ దేవతను కొలుస్తారు.

రాయల కాలంలో...

విజయనగర సామ్రాజ్య కాలంలో ఉరుము కళాకారులకు చాలా ప్రాధాన్యత ఉండేదని చరిత్ర చెబుతోంది. వీరికి మాన్యాలు ఇచ్చి శ్రీకృష్ణదేవరాయలు ప్రోత్సహించినట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. కాలక్రమేణా ఈ కళ అంతరించి పోయి, కుల వృత్తినే నమ్ముకుని పూట గడవని స్థితిలో ప్రత్యామ్నాయ జీవనోపాధులపై దృష్టి సారించారు. ఉరుముల వాయిద్యం ఒకేసారి ఏక ధాటిగా వాయిస్తే కారుమబ్బులు ఉరుములతో పయనిస్తున్నట్లు భ్రమ కలుగుతుంది. వీరి ఆరాధ్య దైవం శ్రీశైల మల్లన్న. ఆయన మహత్య గాథలను ఉరుముపై దరువులు వేస్తూ గానం చేస్తుంటారు. చరణానికి చరణానికీ మధ్య ముక్తాయింపుల్లో గంభీరమైన శబ్దాలు సృష్టించి వలయాకార విన్యాసాలు చేస్తుంటారు. వీరిని అక్కమ్మ దేవతల ప్రతిరూపంగా భావిస్తారు.

జీవం పోసిన గత ప్రభుత్వం

కొన్నేళ్లుగా ఉనికి కోల్పోయిన ఉరుముల కళాకారుల వృత్తి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. 2022, నవంబర్‌లో తిరుపతి వేదికగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి సౌజన్యంతో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆత్మకూరుకు చెందిన ఉరుముల కళాకారుల బృందం పాల్గొంది. ఆ సమయంలో తమ విన్యాసాలతో ఆకట్టుకున్న కళాకారులు... అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. అప్పటి నుంచి ఉరుముల కళకు తగిన ప్రాచుర్యం దక్కుతూ వచ్చింది. ఆత్మకూరు ఉరుముల కళాకారులకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ క్రమంలోనే విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, గ్లోబల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్‌లో, కాణిపాకంలో, తుంగభద్ర పుష్కరాలు, తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఉరుముల నృత్యం తప్పనిసరిగా ఉంటూ వచ్చింది.

పుష్ప- 2లో ఆత్మకూరు వాసులు

ఇటీవల విడుదలైన పుష్ప–2 సినిమాలో జిల్లాకు చెందిన పది మంది ఉరుముల కళాకారులు పాల్గొన్నారు. ఈ బృందానికి ఆత్మకూరుకు చెందిన సోమశేఖర్ నేతృత్వం వహించారు. సినిమాలో దాదాపు పది నిమిషాల పాటు ఉరుములు సోమశేఖర్ కనిపించడం గమనార్హం.


పుష్ప-2 సినిమాలో కనిపిస్తున్న ఆత్మకూరు నివాసి ఉరుముల సోమశేఖర్

ప్రత్యేకంగా గుర్తించాలి

ఉరుముల వృత్తిలో రాణిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ప్రాచీన జానపద కళారూపం కనుమరుగు కాకుండా కాపాడుకుంటూ వస్తున్న వీరిని ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డప్పు కళాకారులకు ఇస్తున్నట్లుగానే ఉరుముల కళాకారులకూ పింఛన్ సౌలభ్యం కల్పించాలి. ఆలయాల వద్ద ఆస్థాన వాయిద్య కళాకారులుగా గుర్తించి గౌరవ వేతనం ఇవ్వాలి.

– ఉరుముల సోమశేఖర్, ఆత్మకూరు

దృష్టి ఏమార్చి... బంగారు చైన్ లాక్కెళ్లి!

రాప్తాడు రూరల్: దుకాణంలో ఉన్న మహిళ దృష్టిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన అనంతపురం నగర శివారులో సంచలనం రేకెత్తించింది. వివరాలు... అనంతపురం రూరల్ మండల పరిధిలోని బళ్లారి రోడ్డు లలితానగర్‌లో నివాసముంటున్న సత్యేశ్వరరెడ్డి, హేమలత దంపతులు...వాటర్ ప్లాంట్‌తో పాటు కిరాణాకొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం కిరాణాకొట్టులో ఉన్న హేమలత వద్దకు ఓ యువకుడు వచ్చి సిగరెట్టు కావాలని అడిగాడు. సిగరెట్టు ఏదని ఆమె అడుగుతుండగానే క్షణాల్లో ఆమె మెడలో నుంచి బంగారు చైన్ లాక్కొని ఉడాయించాడు. ఆ సమయంలో బాధితురాలు గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల పరిశీలించి జనసంచారం లేకపోవడంతో ఇద్దరు యువకులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తమయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు చుట్టుపక్కల అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల పుటేజీల దర్యాప్తు చేపట్టారు.

యువకుడి అనుమానాస్పద మృతి


విగతజీవిగా పడి ఉన్న సురేష్

యల్లనూరు: మండల కేంద్రానికి చెందిన కడిమన్నగారి బాలయ్య పెద్ద కుమారుడు సురేష్(35) మంగళవారం వైఎస్సార్ జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం లావనూరు సమీపంలోని వంక కల్వర్టుల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆయనకు పదేళ్ల క్రితం వివాహమైంది. భార్య వీరకుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆశా కార్యకర్తగా వీరకుమారి పనిచేస్తోంది. ఈ క్రమంలో ఏడాది క్రితం మనస్పర్థలు చెలరేగడంతో దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు. సోమవారం రాత్రి స్నేహితులతో కలసి ఆర్‌ఎస్ కొండాపురం వెళుతున్న చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన సురేష్ మంగళవారం ఉదయం విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. సురేష్ మృతిపై తండ్రి అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆర్‌ఎస్ కొండాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా, ఎవరైనా హత మార్చారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. కాగా, ఘటనకు సంబంధించి స్థానిక పరిస్థితులపై యల్లనూరు ఎస్‌ఐ శ్రీరాంప్రసాద్ ఆరా తీస్తున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ - బాలుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అబ్దుల్

అనంతపురం: నగర శివారులోని తపోవనం సమీపంలో ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. మంగళవారం సాయంత్రం స్థానిక హెచ్చెల్సీలో ఈతకు వెళ్లిన పిల్లగుండ్ల కాలనీకి చెందిన అబ్దుల్ (16)తో పాటు పవన్ కుమార్ బైక్‌లో వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన అబ్దుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చొన్న పవన్‌కుమార్ కుడికాలికి గాయమైంది. ప్రమాదానికి కారణమైన యువకుడు జయంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై అనంతపురం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కాకినాడలో యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు


కరపత్రాలు విడుదల చేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలు జనవరి 5 నుంచి 8వ తేదీ వరకూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాల్లో యూటీఎఫ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. మహాసభల్లో 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని సమీక్షించడంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ పరిస్థితులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి రానున్న రోజుల్లో చేపట్టాల్సిన ఉద్యమాలు, పోరాటాలపై కార్యాచరణను రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌వీవీ రమణయ్య, సహాధ్యక్షుడు రామప్ప, నాయకులు సుబ్బరాయుడు, చంద్రమోహన్, మహమ్మద్ జిలాన్, నాగేంద్ర, చెన్నారెడ్డి, మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

శభాష్ లక్ష్మీనారాయణ

- అదుపు తప్పి పల్లంలోకి దూసుకెళ్లిన లారీ
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి చేర్చి, ప్రాణాలు కాపాడిన ఖాకీ


లారీలో ఇరుక్కున్న వ్యక్తిని వెలికితీస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, స్థానికులు

ఆత్మకూరు: ప్రమాదం జరిగిన ప్రాంతం పరిధి తమది కాదంటూ కనీసం క్షతగాత్రుల ఇబ్బందిని సైతం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసులను ఇంత కాలం చూశాం. అయితే ఇందుకు భిన్నంగా తన పరిధి కాకున్నా... ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ఆత్మకూరు పీఎస్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ శరవేగంగా స్పందించారు. క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లోనే ఆస్పత్రికి చేర్చి వారి ప్రాణాలు కాపాడారు. వివరాలు... అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు మంగళవారం బయలుదేరిన ఓ లారీ... ఆత్మకూరు దాటిన తర్వాత కళ్యాణదుర్గం రూరల్ పరిధిలోని కొత్తపల్లి వద్దకు చేరుకోగానే ప్రమాదానికి గురైంది. ఎదురుగా కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న ఓ లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఉన్నఫళంగా అడ్డుగా వచ్చిన కారును తప్పించబోవడంతో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి దూసుకెళ్లింది. పొలాల్లో ఉన్న ఓ పెద్ద గుంతలో పడి లేచి దాదాపు 50 మీటర్ల దూరం వెళ్లి ఆగిపోయింది. ఘటనలో లారీ క్యాబిన్ ఉన్న ఆరుగురు ఇరుక్కుపోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 20 నిమిషాల పాటు స్థానికులతో పాటు శ్రమించి లారీ క్యాబిన్ నుంచి క్షతగాత్రులను వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా స్థానిక పీహెచ్‌సీకి చేర్చారు. ఒకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఒక బాధాకరమైన ప్రమాదం జరిగిన మొదటి గంటలోపే (గోల్డెన్ అవర్) క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చడం ద్వారా వారి ప్రాణాలను కాపాడిన ఎస్‌ఐ లక్ష్మీనారాయణ చొరవను ఆత్మకూరు వాసులు అభినందించారు.

కార్యాలయానికి తాళం వేసిన 'యానిమేటర్లు'

- జీతాల కోసం టీడీపీ నేతలను కలవమన్న ఏపీఎం


తాళం వేసి నిరసన తెలుపుతున్న పాత యానిమేటర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు

శెట్టూరు: స్వాహా చేసిన తమ జీతాలు చెల్లించమని కోరితే టీడీపీ నేతలను కలవమంటారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఐకేపీ కార్యాలయానికి తాళం వేసి పాత యానిమేటర్లు ఆందోళన చేపట్టారు. ఆందోళనకు ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. వివరాలు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనిచేసిన యానిమేటర్లను కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతలు బలవంతంగా తొలగించి, తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. తొలగించిన వారు పనిచేసిన మూడు నెలలకు సంబంధించి జీతాలు పాత యానిమేటర్ల పేరునే ప్రభుత్వం జారీ చేసింది. అయితే ఈ మొత్తాన్ని వారికి చెల్లించకుండా అధికారులు, సీసీలు స్వాహా చేశారు. ఈ విషయమై గత నెల రోజులుగా ఏపీఎం గంగన్నను యానిమేటర్లు, ప్రజా సంఘాల నాయకులు కలసి స్పందన లేకుండా పోయింది. మండల వ్యాప్తంగా 28 మంది పాత యానిమేటర్లకు సంబంధించి రెండు నెలల జీతాలు సుమారు రూ.4 లక్షలు స్వాహా చేసిన వైనంపై మంగళవారం మరోసారి బాధితులు నిలదీశారు. ఆ సమయంలో ఏపీఎం గంగన్న మాట్లాడుతూ... జీతాలు కావాలంటే స్థానిక టీడీపీ నేత అనుమతి తీసుకురావాలంటూ సూచించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ నేతల ఆధ్వర్యంలో కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాంభూపాల్ కార్యాలయం వద్దకు చేరుకుని ఎమ్మార్పీఎస్ నాయకులకు సర్ది చెప్పి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు సాకే గురుమూర్తి, అనుంపల్లి రామన్న, మారెన్న, వెట్టి తిప్పేస్వామి, బాబు, మహేష్, పాలాక్షి, నవీన్, యానిమేటర్లు లింగరాజు, రమేష్, చంద్రకళమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరుబాట తప్పదు

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న


మాట్లాడుతున్న ప్రసన్న

గుత్తి: రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణకు పోరుబాట అనివార్యమైందని, ఇందుకు సన్నద్ధంగా ఉండాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ పిలుపునిచ్చారు. గుత్తి పట్టణ శివారులోని మాసినేని ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ 32వ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రసన్న, రమేష్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో ఉద్యమ కార్యాచరణను రూపొందించి దానికి అనుగుణంగా చేపట్టనున్న ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, అధ్యక్షుడు సిద్దు, సభ్యులు గిరి, శివ, వెంకి, సూర్య, ధన, బాలు, నవీన్, భీమా, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మెడికో మృతి


గోపీకృష్ణ (ఫైల్)

యాడికి: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాడిపత్రికి చెందిన వైద్య విద్యార్థి గోపీకృష్ణ సోమవారం రాత్రి మృతి చెందాడు. యాడికి మండలం రాయలచెరువు పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నారాయణస్వామి, కృష్ణవేణి దంపతుల కుమారుడు గోపీకృష్ణ కర్నూలులోని విశ్వభారతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 9న స్నేహితుడితో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి 11 గంటలకు మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం ఆయన మృతదేహాన్ని కుటుంబసభ్యులు తాడిపత్రికి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యులు అప్పయ్య, దేవరాజ్, సిబ్బంది తదితరులు తాడిపత్రికి చేరుకుని గోపీకృష్ణ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కందిని కాపాడుకోండి : జేడీఏ

అనంతపురం అగ్రికల్చర్: కంది పంట ఆశాజనకంగా ఉన్నందున మేలైన దిగుబడులు సాధించేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతపురం రూరల్ ఏఓ జె.శశికళ అధ్యక్షతన కురుగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ ఎం.రవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కందికి ఆశించిన మారుకామచ్చల పురుగు, శనగపచ్చ పురుగు నివారణకు సిఫారసు చేసిన మందులతో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సారి మంచి ధరలు ఉన్నందున మంచి దిగుబడులు సాధించేలా కంది పంటను కాపాడుకోవాలన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు సంబంధించి ఈ నెల 30 వరకు గడువు ఉందని, ఈ సౌలభ్యాన్ని వరి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగతా వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి ప్రీమియం చెల్లింపు గడువు పెంచాలని కోరామని, అనుమతి రాగానే వాటిని కూడా సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

మహాకుంభమేళాకు ప్రత్యేక రైలు

రాయదుర్గం టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 2025, జనవరి 13 నుంచి 2025, ఫిబ్రవరి 26 వరకు జరిగే మహా కుంభమేళాకు నెలలో రెండు ట్రిప్పుల చొప్పున రాయదుర్గం, బళ్లారి మీదుగా మైసూరు–దానాపూర్–మైసూర్ ప్రత్యేక రైలును నడపనున్నారు. ఈ మేరకు సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మంజునాథ కనమడి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జనవరి 18, ఫిబ్రవరి 15, మార్చి 1 తేదీ శనివారాల్లో మైసూరులో సాయంత్రం 4.30 గంటలకు రైలు (06207) బయలుదేరి బెంగళూరు, చిత్రదుర్గం, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హుబ్లీ, విజయపుర, సత్నా, ప్రయాగ్‌రాజ్ మీదుగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌కు చేరుకుంటుంది. అలాగే జనవరి 22న, ఫిబ్రవరి 19, మార్చి 5న వచ్చే బుధవారాల్లో వేకువజాము 1.45 గంటలకు బయలుదేరిన రైలు (06208) అదే స్టేషన్ల మీదుగా మైసూరుకు చేరుకుంటుంది. ఈ సౌలభ్యాన్ని జిల్లా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

క్లుప్తంగా

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి



సోలార్ ప్యానళ్లను పరిశీలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: 'ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి అన్నారు. మంగళవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారులు సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం గురించి పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ రాయితీతో ఇంటిపై సోలార్‌రూఫ్ టాప్ నిర్మించుకోవచ్చన్నారు. దీని వల్ల విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోలార్‌రూఫ్‌టాప్ కౌంటర్లను అదనపు ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, రూరల్ డీఎస్పీ టి. వెంకటేష్, ఏఆర్‌డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రీ క్రిస్మస్ వేడుకలు

రాప్తాడురూరల్: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం రూరల్ రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుపుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా పాస్టర్లు కుటుంబ సభ్యులతో హాజరవుతారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నాగరాజు తెలిపారు. పాస్టర్స్, పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, కానుకలు పంపిణీ చేస్తామన్నారు.

పఠన పోటీల్లో ప్రతిభ



చిన్నారులను అభినందిస్తున్న స్వామి ఆత్మవిదానంద సరస్వతి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన చిన్నారులు భగవద్గీత పఠన పోటీలలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. ఈ మేరకు మంగళవారం తపోవనంలోని శ్రీచిన్మయా జగదీశ్వరాలయంలో చిన్నారులను స్వామి ఆత్మవిదానంద సరస్వతీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్ జిల్లా వేదికగా పోటీలు జరిగాయన్నారు. ఇందులో నగరానికి చెందిన ఎల్కేజీ చిన్నారి అనంత ధాన్య ప్రథమ బహుమతితో పాటు రూ.10 వేల నగదు బహుమతిని, 5వ తరగతి చదువుతున్న యాపర్ల సమృద్‌రెడ్డి తృతీయ బహుమతితో పాటు రూ.6 వేల నగదు బహుమతి అందుకోవడం గర్వకారణమన్నారు. పిల్లల తల్లిదండ్రులను కూడా స్వామీజీతో పాటు ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకులు పాలసముద్రం నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల వైఎస్సార్ జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో జిల్లా విద్యార్థి వి.ధ్యానేశ్వర్‌రెడ్డి సత్తా చాటాడు. జాతీయస్థాయికి ఎంపియ్యాడు. ఈ క్రమంలో డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు మంగళవారం విద్యార్థిని అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

'కార్పొరేట్' దోపిడీ అరికట్టండి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ముందస్తు అడ్మిషన్ల పేరుతో కార్పొరేట్ విద్యా సంస్థలు సాగిస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ జిల్లాలోని పలు కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు అప్పుడే మొదలు పెట్టారన్నారు. అడ్మిషన్ పొందితే ఫీజు రాయితీ ఉంటుందంటూ మాయమాటలు చెబుతున్నారని తెలిపారు. ఈ విషయంలో అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ముందస్తు అడ్మిషన్లు అరికట్టకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. డీఈఓను కలిసిన వారిలో నగర నాయకులు మంజునాథ్, రాధా, జ్యోతి, లలిత, తారక్ ఉన్నారు.

అభివృద్ధి అగమ్యగోచరం

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్ల పనులు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆగిన రూ.13 కోట్ల పనులు
- ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలన్న మేయర్ వసీం
- వాడీవేడిగా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్‌కు సమస్యలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: 'వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సాధారణ, ఆర్థిక సంఘం, ఎన్ క్యాప్ నిధులు రూ.13 కోట్లతో టెండర్లు పిలిస్తే ఒక్క పని కూడా మొదలుకాలేదు. సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్ల పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు కౌన్సిల్‌లో మరో 26 కోట్ల పనులకు ఆమోదం తెలిపాం. ఈ పనులు జరిగేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేక చొరవ చూపి నగరాభివృద్ధికి పాటు పడాలి' అని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. మేయర్ మాట్లాడుతూ రోడ్లు, కాలువలు పూర్తి కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. గడిచిన ఆరు నెలల్లో ఒక్క పని కూడా పూర్తి కాలేదన్నారు.బయోమైనింగ్ బిల్లులు చెల్లిస్తే తదుపరి పనులు పూర్తి చేస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలియజేయగా... గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కంపోస్టు యార్డులో చెత్తను పూర్తిగా తొలగించేందుకు బయోమైనింగ్ ద్వారా చెత్త నిర్వహణ చేపడితే దానిపై దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారని మేయర్ వసీం గుర్తు చేశారు. వాటిపై విచారణ జరిగాకే బిల్లులు చేయాలని కమిషనర్ రామలింగేశ్వర్‌కు తేల్చి చెప్పారు. నగర జనాభా, పారిశుద్ధ్యం మెరుగు దృష్ట్యా వివిధ డివిజన్లకు మరో 132 మంది కార్మికుల అవసరం ఉందని మేయర్ తెలపగా అజెండాలోని ఆ అంశాన్ని సభ్యులు ఆమోదించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..

నగరంలో కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, నాగమణి, బాలాంజినేయులు, దుర్గాదేవి తదితరులు అధికారులకు సూచించారు. కార్పొరేటర్లు రహంతుల్లా, లాలూ కుక్కకాటుకు గురయ్యారని, ఇక ప్రజల బాధలు ఎవరితో చెప్పుకోవాలని ప్రశ్నించారు. 3 వేల కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు, అందుకు రూ.85 లక్షలు ఖర్చయినట్లు అధికారులు చెబుతున్నారని, అయితే స్టెరిలైజేషన్ ప్రక్రియ ఎక్కడా జరగలేదని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. కమలానగర్‌లో ఓ కుక్కకు స్టెరిలైజేషన్ చేసినా అది పిల్లలను ఈనిందని, స్టెరిలైజేషన్ ఎక్కడ చేశారని కార్పొరేటర్ అబూసలేహా అధికారులను నిలదీశారు. ఏబీసీ నుంచి అనుమతులు రాగానే కుక్కల స్టెరిలైజేషన్ ప్రారంభిస్తామని ఎంహెచ్ఓ పేర్కొన్నారు. 21 మంది ఇంజినీరింగ్ కార్మికులకు మాత్రమే వేతనం పెంచడం సరికాదని, 309 మంది కార్మికులకు వేతనం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని పలువురు కార్పొరేటర్లు డిమాండ్ చేయగా.. చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

రూ.26 కోట్ల పనులకు ఆమోదం

నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో రూ.26.19 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఇదిలా ఉండగా కౌన్సిల్ అజెండాను పూర్తిగా చదవకుండానే అంశాలను మమ అనిపించేయడం గమనార్హం. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, ఎస్ఈ భాస్కర్, ఈఈలు షాకీర్, రాధాకృష్ణ, ఏసీపీ శ్రీనివాసులు, టీపీఓ శిరీష, టీపీఎస్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని వివిధ డివిజన్లలో కార్మికుల విధులపై స్పష్టత ఇవ్వాలని కార్పొరేటర్ సాకే చంద్ర ఎంహెచ్ఓ విష్ణుమూర్తిని డిమాండ్ చేశారు. కొన్ని డివిజన్లకే సిబ్బందిని పరిమితం చేయకుండా అన్ని డివిజన్లకు సమానంగా కేటాయించాలన్నారు. సంత మార్కెట్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పండమేరు వద్ద పేద ప్రజలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే.. ఇటీవల టీడీపీ నాయకులు పరిటాల సునీత పేరుతో బోర్డు వేశారని కార్పొరేటర్ సైఫుల్లాబేగ్ విమర్శించారు. అర్హులకు న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఒక్క సీ బిల్లు కూడా పెట్టలేదని, కూటమి ప్రభుత్వంలో మాత్రం సీ బిల్లుల పేరుతో రూ.89 లక్షల మేర అక్రమాలు జరిగాయని తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలాలను ఎవరైనా కబ్జా చేస్తే న్యాయపరంగా ముందుకెళ్లాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనారోగ్యం పేరుతో బదిలీ వర్కర్లను నియమించుకున్న 200 మందిని విచారించాలని సూచించారు. ముంపు ప్రాంతాలకు వరద సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్లు శ్రీనివాసులు, దుర్గాదేవి, మునిశేఖర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, అనంతపురం క్లబ్ వద్ద బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని డిప్యూటీ మేయర్ కోగటం పేర్కొన్నారు. సెంట్రల్ పార్క్ స్థలాన్ని రీ సర్వే చేసి పరిరక్షించాలని కార్పొరేటర్ బండి నాగమణి డిమాండ్ చేశారు. అధికారులు, విలేకరుల పేరుతో ఏసీపీ శ్రీనివాసులు అక్రమాలకు పాల్పడుతున్నారని, అతన్ని సరెండర్ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన అసిస్టెంట్ కలెక్టర్



అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మంగళవారం కలిశారు. అంతకు ముందు సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అసిస్టెంట్ కలెక్టర్‌కు స్వాగతం పలికారు. పంచాయతీరాజ్ వ్యవస్థ, విధానాలు, అమలు, నిధుల సమీకరణ వంటి అనేక అంశాలపై అసిస్టెంట్ కలెక్టర్ అధ్యయనం చేయనున్నారు. శిక్షణలో భాగంగా ఆమె జిల్లా పరిషత్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గిరిజమ్మతో ప్రత్యేకంగా మాట్లాడారు. జెడ్పీలో పాలకవర్గం ఎన్నిక, విధులు, బాధ్యతల గురించి అడిగి తెలుసుకున్నారు. నిధుల సమీకరణ గురించి ఆరా తీశారు.

రైతులకు మెరుగైన సేవలు

ఆత్మకూరు: రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామాల్లోని రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం ఆమె ఆత్మకూరు గ్రామం వద్ద ఉన్న పప్పుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగుపై రైతులకు పలు సూచనలిచ్చారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే పెట్టుబడులు తగ్గుతాయని, అలాగే దిగుబడులు పెరిగి రైతులకు లాభాలు వస్తాయన్నారు. రబీలో సాగు చేస్తున్న టమాట, వేరుశనగ, మామిడి పంటలకు ఈ నెల 31వ తేదీ వరకూ ఇన్సూరెన్స్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీడీఏ మద్దిలేటి, ఏడీఏ రవి, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత , వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృత్తి ధర్మాన్ని పాటించాలి

అనంతపురం మెడికల్: వృత్తి ధర్మాన్ని పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలందించాలని ఆధ్యాత్మిక ప్రవచనకర్త గోపీనాథ్ దాస్ వైద్యసిబ్బందికి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో స్టాఫ్‌నర్సుల కోసం 'ఆచరణాత్మక కార్యాచరణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులతో ప్రేమపూర్వకంగా మాట్లాడితే సగం వ్యాధి నయమవుతుందన్నారు. అనంతరం గోపీనాథ్ దాస్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ హేమలత, పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్లు నాగమణి, రజిని, నాగమణిలు సన్మానించారు.

పెన్షనర్లకు సన్మానం

అనంతపురం ఎడ్యుకేషన్: రిటైర్డ్ కళాశాల టీచర్స్ అసోసియేషన్ (ఆర్సీటీఏ) ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్లను సన్మానించారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ జేఎస్ ఇంతియాజ్ అహమ్మద్, అధ్యాపకులు డాక్టర్ అలిమౌలాలి, జి.హేచంద్రన్, ఎం.సూర్యప్రకాష్ రావును సన్మానించారు. కార్యక్రమంలో ఆర్సీటీఏ జిల్లా కార్యదర్శి ఎస్.రంగస్వామి, వై.రామకృష్ణారెడ్డి, హొన్నూరప్ప, చెన్నకేశవులు, రాజేంద్రప్రసాద్, వసంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

అనంతపురం: ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని ఎస్కే యూనివర్సిటీ పొలిటికల్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ చంద్రమౌళి రెడ్డి అన్నారు. ఎస్కేయూ పొలిటికల్ సైన్సెస్ విభాగంలో సీనియర్ విద్యార్థులు మంగళవారం జూనియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న రాజకీయ పరిస్థితులు, రాజ్యాంగ సవరణలు, పార్లమెంట్‌లో కొత్తగా ప్రవేశపెడుతున్న బిల్లులు తదితర అంశాలపై నూతన విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టీచింగ్ అసిస్టెంట్లు డాక్టర్ నరసింహా రెడ్డి, ఓబులేసు, వెంకటేశ్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరుబాట

- ప్రభుత్వానికి పెన్షనర్ల హెచ్చరిక



లలిత కళాపరిషత్తులో పెన్షనర్లను సన్మానించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: ఎన్నో నెలల నుంచి ఎదురు చూస్తున్నా ప్రభుత్వం నుంచి పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం లభించకపోవడం ఆవేదన కల్గిస్తోందని, ఇలాగే సాగితే పోరుబాట తప్పదని పెన్షనర్లు హెచ్చరించారు. మంగళవారం నగరంలో వేర్వేరు చోట్ల జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని విశ్రాంత ఉద్యోగులు ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకున్నారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దన గౌడు నేతృత్వంలో స్థానిక లలిత కళాపరిషత్తులో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెద్దన గౌడుతో పాటు ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు వెంటనే అరియర్స్, డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీకి కనీసం కమిషన్ కూడా వేయలేకపోవడం విచారకరమన్నారు. వెంటనే పెన్షనర్లకు బకాయిలు చెల్లించి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. సమస్యల వాణి గట్టిగా వినిపించడానికి సంఘాన్ని బలోపేతం చేయాలని తీర్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరళకుమారి, ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాలంకి సుబ్బరాయన్, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, ఏపీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖరరెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా 75 ఏళ్ల వయసు దాటిన 56 మంది పెన్షనర్లను సన్మానించారు.

ఉపాధ్యాయ భవన్‌లో..

జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో ప్రభాకర గుప్తా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త ముడార్ సుధీర్, ఎస్టీఓ లక్ష్మి, ఆచార్య పుల్లయ్య, పాలమడ రమేష్‌బాబు, ముత్యాలరెడ్డి, గోపాల్, రియాజుద్దీన్, సంఘం వ్యవస్థాపక కుటుంబీకులు సుజాతమ్మ తదితరులు మాట్లాడుతూ వృద్ధులు తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ కళాకారుడు రమణయ్య మరాఠి ఏకపాత్రాభినయంతో పాటు వృద్ధులు ఆలపించిన పాటలు, పద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం 22 మందిని ఘనంగా సత్కరించారు.

రెవెన్యూ సదస్సులో 8 వినతులు



ఆత్మకూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 8 వినతులు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూములకు సంబంధించిన సమస్యలున్న వారు అర్జీలు ఇస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహమూర్తి, వీఆర్ఓ లక్ష్మీదేవి, వీఆర్ఏలు రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మీనాయక్ మాట్లాడుతూ, భూ సమస్యలున్న వారు అర్జీలు సమర్పించి పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, వీఆర్ఓ మల్లికార్జున, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలచెర్లలో రెవెన్యూ సదస్సు

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 19వ తేదీ మండలంలోని పాలచెర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుకు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. బుక్కచెర్ల రెవెన్యూ గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కనగానపల్లి: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని తగరకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. సదస్సుకు విచ్చేసిన గ్రామస్తులు వివిధ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సరళ, వీఆర్వో మారుతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప పడిపూజ

అనంతపురం కల్చరల్: అంబేడ్కర్ నగర్‌లో బుధవారం అయ్యప్పస్వామి మహా పడిపూజ జరగనుంది. ఈ మేరకు అయ్యప్పస్వామి శ్రీరామ భక్త మండలి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామాలయం వేదికగా ఉదయం నుంచి భజనలు, పడిమెట్ల పూజలు, మధ్యాహ్నం సామూహిక భిక్ష కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రసాద్ నంబూద్రి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నగరోత్సవం నిర్వహిస్తామని మాలధారులందరూ పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు

చెన్నేకొత్తపల్లి: ప్రజలకు అవగాహన కల్పించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఉమ్మడి అనంతపురం జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో నమోదైన మలేరియా కేసులను అడిగి తెలుసుకున్నారు. ఇకపై కేసులు నమోదు కాకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగునీరు నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం సబ్ యూనిట్ అధికారి జయరాం నాయక్, సీహెచ్ఓ గోవిందమ్మ, పీహెచ్ఎన్ పద్మావతితో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో తహసీల్దార్ విజయకుమారి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొనే దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కూడా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గ్రామంలో ధ్యాన మందిరం కోసం అనువైన ప్రాంతంలో 5 సెంట్ల స్థలాన్ని మంజూరు చేస్తామన్నారు. అనంతరం రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ కృష్ణా, ఆర్ఐ రాగే కరుణాకర్, సీఐ టీవీ శ్రీహర్ష, అధికారులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నగరంలోని తెలుగుతల్లి విగ్రహం సమీపంలో ఎండిపోయిన ఓ పెద్ద కొమ్మ కిందకు వాలింది. పొరపాటున ఆ కొమ్మ వాహనదారులకు తగిలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావున నగర పాలక సంస్థ అధికారులు స్పందించి ఎండిన కొమ్మను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

గురి తప్పొద్దు



ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఏఆర్ పోలీసులు

అనంతపురం: నగర శివారులోని మస్నీల రేంజ్‌లో ఏఆర్ పోలీసులు మంగళవారం తుపాకులతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. మొబలైజేషన్‌లో భాగంగా వార్షిక ఫైరింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి వృత్తి నైపుణ్యం పెంచుకునేలా ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డప్ప రెడ్డి, ఆర్ఎస్ఐలు జాఫర్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ప్రీమియం లిక్కర్ స్టోర్

అనంతపురం: నగరంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామమోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 తుది గడువుగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. https://apsbcl.ap.gov. in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని..పూర్తి చేసిన తర్వాత సంబంధిత డాక్యుమెంట్లు జతచేసి తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నగరాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: నగరాభివృద్ధికి చర్యలు తీసుకోవాలంటూ సీపీఎం నాయకులు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నగర పాలక సంస్థకు చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. నగరంలో ఏర్పడిన గుంతలను పూడ్చాలన్నారు. చెత్త సేకరణకు క్లాప్ ఆటోలను పునరుద్ధరించాలని, మరువవంక, నడిమివంకకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు మేయర్ వసీంకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, కార్యదర్శి సభ్యులు గోపాల్, వలి, వెంకట్, నారాయణ, ముత్తూజ, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.